క్లుప్తంగా

నేడు గురివినాయుడుపేటలో కంటి వైద్యశిబిరం

సాలూరు: పాచిపెంట మండలంలోని గురివినాయుడుపేట పీహెచ్‌సీ వద్ద గురువారం ఉచిత కంటివైద్యశిబిరం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు ఓ ప్రకటనలో తెలిపారు. శంకర్ ఫౌండేషన్ కంటి ఆస్పత్రి విశాఖపట్నం వారితో జిల్లా అంధత్వ నివారణ సంస్థ సౌజన్యంతో ఈ శిబిరం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. శిబిరానికి వచ్చే వారు తప్పనిసరిగా ఆరోగ్యశ్రీ కార్డు, ఆధార్ కార్డు ఇతర గుర్తింపు కార్డు తీసుకురావాలని, మరిన్ని వివరాలకు ఫోన్ 7287023743 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

మజ్జి ప్రణీత్‌బాబుకు మాజీ డిప్యూటీ సీఎం నివాళులు



ప్రణీత్‌బాబుకు చిత్రపటానికి పూలు వేసి నివాళులు అర్పిస్తున్న మాజీ డిప్యూటీ సీఎం పీడిక రాజన్నదొర తదితరులు

సాలూరు: జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు చిన్నకుమారుడు ప్రణీత్‌బాబుకు మాజీ డిప్యూటీ సీఎం పీడిక రాజన్నదొర బుధవారం నివాళులు అర్పించారు. విజయనగరంలో నిర్వహించిన ప్రణీత్‌బాబు పెద్దకర్మ కార్యక్రమంలో రాజన్నదొర పాల్గొని ప్రణీత్‌బాబు చిత్రపటానికి పూలు వేసి నివాళులర్పించి తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు.

సీఆర్పీలు, వీఓఏలకు శిక్షణ తరగతులు

పార్వతీపురం రూరల్: పార్వతీపురం వెలుగు కార్యాలయంలో వార్షిక అప్పులు, జీవనోపాధి ప్రణాళికలపై రెండవ రోజు బుధవారం 13 గ్రామ సంఘాల సీఆర్పీలు, వీఓఏలకు శిక్షణ తరగతులు నిర్వహించినట్లు పార్వతీపురం వెలుగు ఏపీఎం సన్నిబాబు పేర్కొన్నారు. అనంతరం చినబొండపల్లిలో మహిళా సంఘాల సభ్యులకు వివరించి అవగాహన కల్పించామని తెలిపారు. కార్యక్రమంలో సీసీలు, వీఓఏలు, మహిళా సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

ఎంపీడీఓగా జి.రమేష్ బాబు



పార్వతీపురం రూరల్: పార్వతీపురం మండల ప్రజాపరిషత్ అధికారిగా జి.రమేష్ బాబు (ఎఫ్ఏసీ)బదిలీపై వచ్చారు. ఈ మేరకు బుధవారం ఆయన కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఎంపీడీఓగా విధులు నిర్వహించిన రూపేష్‌కు ఇటీవల బదిలీ అయిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో ఏఓగా ఉన్న జీవీ రమణ మూర్తి ఇన్‌చార్జ్ ఎంపీడీఓగా ఇంతవరకు సేవలందించారు. బాధ్యతలు చేపట్టిన రమేష్ బాబును మండల పరిషత్ ఉద్యోగులు, సిబ్బంది. మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు.

ఉచిత నేత్ర వైద్య శిబిరం విజయవంతం

సాలూరు: పట్టణంలోని నవజీవన్ ఆశ్రమంలో బుధవారం నిర్వహించిన ఉచిత నేత్ర వైద్య శిబిరం విజయవంతమైంది. ఈ శిబిరంలో 108 మందికి పరీక్షలు చేసి, 51 మందికి ఆపరేషన్‌లు అవసరమని గుర్తించారు. కార్యక్రమంలో విజయనగరం పుష్పగిరి కంటి ఆస్పత్రి వైద్యులు, సిబ్బంది సురేష్, కోమలి, లిఖిత, స్వాతి, చిన్నమ్మలు తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ షాక్‌తో జేఎల్‌ఎంకు గాయాలు

సాలూరు రూరల్: మండలంలోని పగులు చెన్నూరు, పట్టుచెన్నూరు జేఎల్ఎం కె.బాలకృష్ణ విద్యుత్ షాక్ కారణంగా గాయాల పాలయ్యాడు. వివరాలిలా ఉన్నాయి. తోణాం జేఎల్ఎం బంగార్రాజు సెలవులో ఉండడంతో గత నెల 30 వ తేదీన ముంగివాని వలస గ్రామంలో రైతుకు విద్యుత్ సరఫరాలో వచ్చిన సమస్యను పరిష్కరించేందు పగులు చెన్నూరు జేఎల్ఎం బాలకృష్ణ వెళ్లాడు. సమస్యలను పరిష్కరిస్తుండగా తీగల్లో అకస్మాత్తుగా విద్యుత్ సరఫరా రావడంతో షాక్‌కు గురైనట్లు విద్యుత్‌శాఖ సిబ్బంది ఆలస్యంగా తెలియజేశారు. తోణాం పీహెచ్‌సీలో బాధిత జేఎల్‌ఎంకు ప్రథమ చికిత్స అందించిన అనంతరం విశాఖపట్నం కేజీహెచ్‌కు తరలించినట్లు ఆ శాఖ సిబ్బంది తెలిపారు.

ఉపాధి వేతనదారులకు ఓఆర్‌ఎస్ ప్యాకెట్ల పంపిణీ



ఓఆర్‌ఎస్ ప్యాకెట్లను అందజేస్తున్న ఎంపీడీఓ స్వరూప రాణి

మక్కువ: స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో బుధవారం ఉపాధి హామీ వేతనదారులకు పంపిణీ చేయనున్న ఓఆర్‌ఎస్ ప్యాకెట్లను ఉపాధి హామీ సిబ్బందికి ఎంపీడీవో డీడీ స్వరూపారాణి అందజేశారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ ఎండల తీవ్రత ఎక్కువగా ఉన్నందున, పని ప్రదేశాలలో తాగునీరు, ప్రథమ చికిత్స కిట్లు, టెంట్లు అందుబాటులో ఉంచాలని సిబ్బందికి సూచించారు. వేతనదారులకు ఓఆర్ ఎస్ ప్యాకెట్లు పంపిణీ చేయాలని చెప్పారు. కార్యక్రమంలో ఉపాధి హామీ ఏపీఓ ఎస్. ఈశ్వరమ్మ, ఈసీ వెంకటలక్ష్మి, ఉపాధి హామీ సిబ్బంది పాల్గొన్నారు.

గోశాల బిల్లుల కోసం ఎదురుచూపులు



ఫస్ట్‌స్పెల్‌లో నిర్మించిన గోశాల

- ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతున్న రైతులు

సీతానగరం: రాష్ట్రప్రభుత్వం ఉపాధి హామీ నిధులతో పాడిరైతులకు మంజూరుచేసిన గోశాలల నిర్మాణాలు పూర్తిచేసి 7 నెలలు గడిచినా ఇంతవరకూ బిల్లులు చెల్లించకపోవడంతో లబ్ధిదారులు పడిగాపులు కాస్తున్నారు. ఈ నేపథ్యంలో 2024లో జరిగిన శాసనసభ ఎన్నికల్లో కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన నెలరోజుల్లో ఫస్ట్ స్పెల్‌లో 23, సెకెండ్ స్పెల్‌లో 88 గోశాలలు పార్టీకోసం కష్టపడి పనిచేసిన వారిలో పాడి పశువులున్నా లేకున్నా తెలుగుతమ్ముళ్లకు గోశాలలు మంజూరు చేసింది. ఈ మేరకు సంబంధిత అధికారులు ఫస్ట్‌స్పెల్‌లో 23 గోశాలలను మంజూరు చేయగా 22 గోశాలలు నిర్దేశించిన గడువు లోగా లబ్ధిదారులు పూర్తిచేశారు. వారిలో పాడి పశువులు 6 ఉన్న రూ.2.30 లక్షలు, 4 పశువులున్న రైతులకు రూ.1.80 లక్షలు, 2 పశువులున్న వారికి రూ. 1.20 లక్షలు వంతున నిధులు మంజూరు చేశారు. పనులు పూర్తి చేసిన వారికి ప్రాధాన్యతా క్రమంలో బిల్లులు చెల్లించనున్నట్లు ప్రకటించడంతో లబ్ధిదారులు సకాలంలో పూర్తిచేసిన గోశాలలకు సంబంధించిన బిలుల్లు అందుతాయని ఆశించారు. అనుకున్నట్లే ఫస్ట్‌స్పెల్‌లో మంజూరుచేసిన గోశాలల లబ్ధిదారులకు బిల్లులు అందాయని చెబుతున్నారు. దీంతో సెకెండ్‌స్పెల్‌లో 88 గోశాలలను మంజూరు చేయడంతో అందులో 76 గోశాలలకు అధికారులు గ్రౌండింగ్ చేశారు. వాటిలో ఇప్పటికి 20 గోశాలల పనులు పూర్తి కాగా మిగతా గోశాలల నిర్మాణాలు వివిధ స్థాయిల్లో ఉన్నాయి. సెకెండ్ స్పెల్‌లో నిర్మాణాలు పూర్తి చేసిన గోశాలల లబ్ధిదారులకు సంబంధించిన గోశాలల రికార్డింగ్ అయింది. రికార్డింగ్ అవడంతో ప్రభుత్వం నుంచి బిల్లుల చెల్లింపులు జరుగుతాయని బ్యాంక్ ఖాతాల్లో చూసుకోవాలని అధికారులు అంటున్నారు. దీంతో సంబంధిత అధికారుల మాటలు నమ్మి బ్యాంక్ పాస్‌పుస్తకాలు పట్టుకుని బ్యాంకుల చుట్టూ తిరగాల్సి వస్తోందని లబ్ధిదారులు ఆందోళన చెందుతున్నారు. పనులు పూర్తి చేసి నెలలు గడుస్తున్నా బిల్లులు చెల్లించక పోవడంతో ఆర్థిక ఇబ్బందులు పడాల్సి వస్తోందని వాపోతున్నారు. ప్రభుత్వం స్పందించి గోశాలల బిల్లుల మంజూరుకు సత్వర చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

బిల్లులు చెల్లించడానికి అప్‌లోడ్ చేశాం



మండలంలో ఉపాధిహామీ నిధులతో చేసిన పనుల బిల్లుల చెల్లింపులకు రూ.4.34 కోట్ల నిధులకు బిల్లులు అప్‌లోడ్ చేశాం. ఉపాధిహామీ పథకం నిధులతో ప్రహరీలు, గోశాలలు, భవనాల మరమ్మతులు, సీసీ రోడ్లు, కాలువల నిర్మాణాలు జరిగాయి. వాటికి బిల్లులు చెల్లించడానికి అవసరమైన రికార్డులను ప్రభుత్వానికి గతనెలలో సమర్పించాం. త్వరలో బిల్లులు చెల్లించడానికి చర్యలు తీసుకోవాల్సి ఉంది.

– పి.త్రివిక్రమరావు, ఎంపీడీఓ



సెకెండ్‌స్పెల్‌లోరూ 2.3 లక్షలతో పూర్తయిన గోశాల

పన్నుల వసూలు వేగవంతం చేయాలి

- డీఎల్‌పీఓ నాగభూషణరావు

బలిజిపేట: ఇంటిపన్నులు, వాణిజ్య పన్నుల వసూలు వేగవంతం చేయాలని డీఎల్‌పీఓ నాగభూషణరావు తెలిపారు. ఈ మేరకు బలిజిపేట ఎంపీడీఓ కార్యాలయంలో గ్రామ కార్యదర్శులతో బుధవారం ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామాల్లో పెండింగ్‌లో ఉన్న ఇంటి పన్నులను వసూలు చేయాలని వాటిని స్వర్ణ పంచాయతీ వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేయాలని సూచించారు. అదేవిధంగా వాణిజ్యపరంగా ఉండే పన్నులను వసూలు చేసి రశీదులు అందించాలని చెప్పారు. చెత్త సంపద కేంద్రాలపై దృష్టిసారించి తడి, పొడి చెత్తలను సేకరించి సంపదను తయారు చేయాలని పిలుపునిచ్చారు. గ్రామాలను పరిశుభ్రంగా ఉంచాలని, పరిసరాల పరిశుభ్రతపై ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ నగేష్, ఈఓపీఆర్‌డీ పుష్పారావు, కార్యదర్శులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న డీఎల్‌పీఓ నాగభూషణరావు

ఎంఈఓల సమస్యల పరిష్కారానికి కృషి చేయండి

- ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేత

పార్వతీపురం టౌన్: మండల విద్యాశాఖ అధికారులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారానికి కృషి చేయాలని పార్వతీపురం ఎమ్మెల్యే బోనెల విజయ్ చంద్రను ఎంఈఓ అసోసియేషన్ ఏపీ రాష్ట్ర అధ్యక్షుడు సామల సింహాచలం కోరారు. ఈ మేరకు బుధవారం ఎమ్మెల్యేను ఆయన కార్యాలయంలో కలిసి వినతిపత్రం అందజేశారు. ముందుగా ఇటీవల శాసనసభ్యులకు నిర్వహించిన క్రీడా పోటీల్లో విశేష ప్రతిభ చూపిన ఎమ్మెల్యేను దుశ్శాలువతో సత్కరించి అభినందించారు. అనంతరం సమస్యలను వివరిస్తూ.. ఎంఈఓలకు సెల్ఫ్ డ్రాయింగ్ పవర్స్ లేకపోవడం వల్ల చాలా ఇబ్బందిగా ఉందని, హైస్కూల్ హెచ్ఎంలకు సెల్ఫ్ డ్రాయింగ్ పవర్స్ ఉండగా మండల విద్యాశాఖలో దాదాపు 150 నుంచి 200 మంది టీచర్లకు డ్రాయింగ్ ఆఫీసర్‌గా ఉన్న ఎంఈఓ లకు సెల్ఫ్ డ్రాయింగ్ పవర్స్ లేకపోవడం చాలా బాధాకరమన్నారు. తమకు ఎంపీడీవోలు డీడీవోలుగా ఉండడం వల్ల వారు అనేక పనులు ఎంఈవోలకు అప్పచెబుతున్నారని ఇందువల్ల విద్యాశాఖ కార్యకలాపాలు, విధులకు ఆటంకం కలుగుతోందన్నారు. పాఠశాలల పర్యవేక్షణ, తనిఖీలు నిర్వహించే ప్రధాన బాధ్యతలు నిర్వహిస్తున్న ఎంఈఓ1 లకు వాహన సౌకర్యం కల్పించాలని కోరారు. తమ సమస్యలపై ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించి, విద్యాశాఖ మంత్రి దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారానికి కషి చేస్తానని హామీ ఇచ్చారని సామల తెలిపారు.



ఎమ్మెల్యే విజయ్‌చంద్రకు వినతిపత్రం అందజేస్తున్న ఎంఈఓ సామల సింహాచలం

మున్సిపల్ పారిశుద్ధ్య కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

- జాయింట్ కలెక్టర్ వినతిపత్రం అందజేత

పార్వతీపురంటౌన్: మున్సిపల్ పారిశుద్ధ్య కార్మికుల సమస్యలు పరిష్కరించాలని సీఐటీయు నాయకుడు గొర్లి వెంకటరమణ, కాంట్రాక్ట్ ఔట్‌సోర్సింగ్ ఎంప్లాయీస్ అండ్ వర్కర్స్ జేఏసీ జిల్లా కన్వీనర్ బి.వి.రమణలు డిమాండ్ చేశారు. ఈ మేరకు కలెక్టర్ కార్యాలయం ఎదుట ఏపీ మున్సిపల్ వర్కర్స్ -ఎంప్లాయీస్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో బుధవారం నిరసన తెలియజేశారు. అనంతరం జాయింట్ కలెక్టర్ ఎస్.ఎస్.శోభికకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మున్సిపల్ పారిశుద్ధ్య కార్మికులకు రిటైర్మెంట్ వయస్సు 62 సంవత్సరాలకు పెంచాలని, రిటైర్మెంట్ బెనిఫిట్స్ గ్రాట్యుటీ, పెన్షన్ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. వేసవి తాపం పెరుగుతున్నందున మే, జూన్ నెలల్లో మున్సిపల్ పారిశుద్ధ్య కార్మికులకు డ్యూటీ టైమింగ్స్ సవరించాలని కోరారు. తక్షణమే మున్సిపల్ పారిశుద్ధ్య కార్మికుల సమస్యల పరిష్కారానికి చర్యలు చేపట్టాలని లేని పక్షంలో సీఐటీయూ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళన చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో పట్టణ పౌర సంక్షేమ సంఘం కార్యదర్శి పాకల సన్యాసిరావు, మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ యూనియన్ నాయకులు నాగవంశం శంకరరావు, చీపురుపల్లి సింహాచలం, నాగవంశం మల్లేష్, బంగారు రాజేష్, మామిడి శివ, శ్రీకాంత్, తదితరులు పాల్గొన్నారు.



జాయింట్ కలెక్టర్ శోభికకు వినతిపత్రం అందజేస్తున్న సీఐటీయూ నాయకులు

దాహార్తి తీర్చేందుకే చలివేంద్రాలు

బలిజిపేట: మండు వేసవిలో ప్రజల దాహార్తిని తీర్చేందుకు చలివేంద్రాలు ఎంతో దోహదపడతాయని బలిజిపేట సర్పంచ్ రాఘులత అన్నారు. ఈ మేరకు బలిజిపేట బస్టాండ్‌లో సొంత నిధులతో ఏర్పాటు చేసిన మజ్జిగ చలివేంద్రాన్ని ఆమె బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బలిజిపేట నుంచి రాజాం, బొబ్బిలి, పెదపెంకి గ్రామాలవైపు వెళ్లేందుకు ప్రయాణికులు ఎక్కువగా వస్తుంటారని, అలాగే మండలంలోని కార్యాలయాలకు వివిధ రకాల పనులపై వచ్చే వారి దాహార్తి తీర్చేందుకు చలివేంద్రం ఎంతో ఉపయోగపడుతుందన్నారు. కార్యక్రమంలో ఈఓపీఆర్‌డీ పుష్పారావు, కార్యదర్శి ఆదిలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



బలిజిపేట బస్టాండ్‌లో మజ్జిగ చలివేంద్రాన్ని ప్రారంభించిన సర్పంచ్ రాఘులత

చినభోగిలి జంక్షన్‌లో చలివేంద్రం

సీతానగరం: జాతీయ రహదారిలోని ప్రధాన రహదారుల్లో చలివేంద్రాలు ఏర్పాటు చేయాలని ఈఓపీఆర్డీ కె.కుమారవర్మ సూచించిన మేరకు సీతానగరం మండలంలోని జాతీయరహదారిపై చినభోగిలి జంక్షన్‌లో మక్కువ–చినబోగిలి వద్ద గ్రామస్తులు చలివేంద్రాన్ని ఏర్పాటు చేశారు. బుధవారం జరిగిన ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఈఓపీఆర్డీ మాట్లాడుతూ ఎండలు తీవ్రంగా ఉన్న కారణంగా దాహార్తిని తీర్చడానికి సీతానగరం మండలం పరిధిలో ఉన్న గ్రామాల ప్రధాన కూడళ్లలో చలివేంద్రాలు ఏర్పాటు చేయాలన్న కలెక్టర్ సూచనల మేరకు దారి పొడవునా ప్రధానకూడళ్లలో చలివేంద్రాలు ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. దాతలు మంచినీరు సరఫరాకు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో సర్పంచ్ కురమాన రాధ, మాజీ సర్పంచ్ ఎస్.జగన్నాథం, మాజీ ఎంపీటీసీ వి. గుంపస్వామి, విరామ టీచర్ ఎం.శంకరరావు. పాల్గొన్నారు.



చినభోగిలిలో గ్రామస్తులు ఏర్పాటు చేసిన చలివేంద్రం

నిధుల మంజూరుకు ప్రతిపాదనలు

సాక్షి ఎఫెక్ట్...

పార్వతీపురం రూరల్: మండల పరిధిలోని పెదబొండపల్లి 1 అంగన్వాడీ కేంద్రం ప్రభుత్వ భవనంలోనే నడుస్తోందని ఐసీడీఎస్ సీడీపీఓ బి.శ్రీనివాసరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు మార్చి 27 వ తేదిన సాక్షి దినపత్రికలో వచ్చిన ''ప్రహరీ కొత్తది-భవనం పాతది'' శీర్షికన కథనంపై ఆయన బుధవారం స్పందించారు. పెదబొండపల్లి-1 అంగన్వాడీ కేంద్రం పాతది కావడం వల్ల, పాత భవనం వెనుక భాగంలో 2017వ సంవత్సరంలో మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం నిధులతో నూతన భవనం మంజూరైందని పేర్కొన్నారు. నూతన భవనానికి పునాదులు తీసి, సిమ్మెంట్‌పై కప్పు వరకూ (లింటల్ లెవెల్) వేశామని, పూర్తిస్థాయిలో నిధులు మంజూరు కాకపోవడంతో నూతన భవనం పనులు ఆగిపోయాయని వివరించారు. నిధుల మంజూరు కోసం ప్రతిపాదనలు సమర్పించినట్లు తెలిపారు. పెదబొండపల్లి-1 అంగన్వాడీ కేంద్రం పాత భవనానికి ఎంపీపీ నిధులతో తాత్కాలికంగా మరమ్మతులు చేపట్టనున్నామని తెలిపారు.

బీసీ కార్పొరేషన్ రుణాలకు ఇంటర్వ్యూలు రేపు



సమావేశంలో మాట్లాడుతున్న మున్సిపల్ కమిషనర్ సీహెచ్ వెంకటేశ్వర్లు

పార్వతీపురంటౌన్: బీసీ కార్పొరేషన్ రుణాలకు బ్యాంకర్లతో ఇంటర్వ్యూలు ఈ నెల 4న పట్టణంలోని మెప్మా కార్యాలయంలో నిర్వహిస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ సీహెచ్ వెంకటేశ్వర్లు తెలిపారు. ఈ మేరకు బుధవారం మున్సిపల్ కార్యాలయంలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి ఆయన మాట్లాడుతూ బ్రాహ్మణ, క్షత్రియ, రెడ్డి, వైశ్య, ఈబీసీ, కాపు కులాలకు వివిధ యూనిట్లకు బ్యాంకు రుణాలు, సబ్సిడీకి సంబంధించి మున్సిపాలిటీ పరిధిలోని 15 సచివాలయాల నుంచి 968 మంది లబ్ధిదారులు పెట్టుకున్న దరఖాస్తులను పరిశీలించి అర్హులను ఎంపిక చేసేందుకు ఈ నెల 4 న ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. దరఖాస్తుదారులు 3 సెట్‌ల ఆన్‌లైన్ దరఖాస్తులు, ఆధార్, రేషన్, కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాల జిరాక్స్, వాహనాల దరఖాస్తుదారులు డ్రైవింగ్ లైసెన్స్, 3 సెట్‌ల ఆన్‌లైన్ దరఖాస్తులు, ఆధార్, రేషన్, కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాల జిరాక్స్‌లు తీసుకుని మున్సిపల్ కార్యాలయం ఆవరణలో గల మెప్మా కార్యాలయంలో హాజరు కావాలని సూచించారు.

విద్యార్థుల వేటలో ఉపాధ్యాయులు

బలిజిపేట: ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులు విద్యార్థుల వేటలో పడ్డారు. గ్రామంలో ఉండే విద్యార్థులలో ప్రైవేట్ పాఠశాలలకు వెళ్తున్న వారి ఇళ్లకు వెళ్లి ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాలని, కొత్తగా అంగన్వాడీ చదువులు పూర్తయిన వారిని ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాలని తల్లిదండ్రులను అభ్యర్థిస్తున్నారు. ఉచిత విద్య, మధ్యాహ్న భోజన పథకం అమలు, మంచిమంచి భవనాలు, మౌలిక సదుపాయాల కల్పన ప్రభుత్వ పాఠశాలల్లో బాగున్నాయని అందుకు తగిన విధంగా విద్యను అందిస్తున్నామని తల్లిదండ్రులకు చెబుతున్నారు. మన బడిని మనమే కాపాడుకోవాలని కోరుతున్నారు. డబ్బులు చెల్లించే ప్రైవేట్ చదువుల కన్నా ప్రభుత్వ పాఠశాలలో మంచి విద్యను అందిస్తున్నామని తెలియజేస్తున్నారు. అందులో భాగంగా కె.గలావల్లిలో ప్రధానోపాధ్యాయుడు కె.పోలినాయుడు, ఉపాధ్యాయురాలు రాధ బుధవారం గ్రామంలో తిరిగి కొత్తవారిని, ప్రైవేట్ పాఠశాలలకు వెళ్తున్న వారిని ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాలని తల్లిదండ్రులకు వివరించారు. అదేవిధంగా బలిజిపేట, పలగర, బర్లి పాఠశాలల పరిధిలో ఉపాధ్యాయులు ప్రత్యేక డ్రైవ్ నిర్వహించారు.



కె.గలావల్లిలో విద్యార్థులను పాఠశాలలో చేర్పించాలని డ్రైవ్ చేస్తున్న ఉపాధ్యాయులు

వైఎస్సార్‌సీపీ మున్సిపల్ కమిటీ నియామకం

పార్వతీపురంటౌన్: వైఎస్సార్‌సీపీ మున్సిపల్ కమిటీని నియమిస్తూ వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి జారీ చేసిన ఆదేశాల మేరకు పార్టీ కేంద్ర కార్యాలయం బుధవారం ఉత్తర్వులు విడుదల చేసింది. ఈ మేరకు వైస్ ప్రెసిడెంట్‌లుగా చందాన ఆనంద్, ఓలేటి గోవింద, జనరల్ సెక్రటరీలుగా పతివాడ గోవింద, మజ్జి వెంకట లక్ష్మి, చింతాడ రాజేష్, బత్తుల శ్రీనివాస్, యేగిరెడ్డి భాస్కరరావు, సెక్రటరీలుగా సువ్వాడ శ్రీను, సోంబాబు, బేత శ్రీనివాస్ రావు, బుగత నాగరాజు, సుంకర అనిల్, ఎగ్జిక్యూటివ్ మెంబర్లుగా రాగోలు గౌరీశంకరరావు, దన్నాన ప్రకాశ్, బొత్స భాస్కరరావు, కోరాడ చంటి, పట్టిగిల్లి రాము, సంతు, బడే సింహాద్రి నాయుడు, పల్లెం జన, బోనం దుర్గ, అలజంగి జితేంద్ర, ఎస్.సూరిబాబు, ఉగాది, పెత్తపోలు, సీహెచ్ భాస్కరరావు, భోగిల సతీష్, గొల్లు పద్మ, ముద్దాల గౌరునాయుడు, ఎస్.కిరణ్, ఎలిశెట్టి త్రినాథ, నీరస త్రినాథ, జి.తమ్మపోలు, కోరాడ సింహాచలం, గురుమూర్తి, సొండి గోపి, చెవిటి వెంటకరమణ, చింతాడ మజ్జి బాబు, సిరిపురపు ప్రకాశ్, మండల రమణ, ఎర్రా రామకృష్ణ కమిటీలో నియమితులయ్యారు.

వైఎస్సార్‌సీపీ సాలూరు మున్సిపల్ కమిటీ ఇదే..

సాలూరు: సాలూరు అసెంబ్లీ వైఎస్సార్‌సీపీ సాలూరు మున్సిపల్ కమిటీని నియమిస్తూ వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయం ఓ ప్రకటన విడుదల చేసింది. ఈ సందర్భంగా వారంతా పార్టీ అధ్యక్షుడు వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి, మాజీ డిప్యూటీ సీఎం పీడిక రాజన్నదొరకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. కమిటీలో ప్రెసిడెంట్‌గా వంగపండు అప్పలనాయుడు, వైస్‌ప్రెసిడెంట్లుగా రౌతు సురేష్, హరి బాలాజీ, జనరల్ సెక్రటరీలుగా పున్నాన మోహనరావు, రౌతు చిన్నయ్య, గొర్లె వెంకటరమణ, పిట్టా వాసు, సెక్రటరీలుగా మెంటాడ చిన్నారావు, జర్జాపు రమేష్, బోను అప్పారావు, గిరి రాంబాబు, నిమ్మకాయల సువర్ణమ్మ, ఎగ్జిక్యూటివ్ మెంబర్లుగా రెడ్డి సత్యవతి, వైకుంఠం వెంకటేశ్వరరావు, సోమువ హంతి పద్మావతి, మేడిశెట్టి లక్ష్మణరావు, జంప శ్యామలరావు,తాడంగి విజయలక్ష్మి, గుణుపురు రమేష్, గౌడు తౌడమ్మ, కర్రి అప్పలస్వామి, సామిరెడ్డి రవి, తప్పెట్ల రమణ, జర్జాపు శ్రీనివాస్ ఉపాధ్యాయుల రాజేశ్వరి, బలభద్రుని శ్రీనివాసరావు, బీసపు విజయలక్ష్మి, మెంటాడ శ్రీనివాసరావు, కొంకి అప్పారావులు నియమితులయ్యారు.

12 వ పీఆర్‌సీ నియామకం చేపట్టాలి

పార్వతీపురం టౌన్: 12వ పీఆర్‌సీ నియామకం చేపట్టాలని ఫ్యాప్టో చైర్మన్ కూర్మినాయుడు డిమాండ్ చేశారు. ఈ మేరకు కలెక్టరేట్ వద్ద బుధవారం ఉపాధ్యాయ సంఘాల సమాఖ్య ఫ్యాప్టో ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ మధ్యంతర భృతి వెంటనే ప్రకటించాలని డిమాండ్ చేశారు. సీపీఎస్ రద్దు తప్ప మరే ఇతర ప్రత్యామ్నాయం వద్దని, పాత విధానం అమలు చేయాలని డిమాండ్ చేశారు. పెండింగ్ డీఏలు అమలు చేయాలని కోరారు. సీపీఎస్ టీచర్స్‌కు 90శాతం క్యాష్ డీఏ ఎరియర్స్ మంజూరు చేయాలన్నారు. బకాయిలు, సరెండర్ లీవ్స్, గ్రాట్యుటీ కమ్యూటేషన్ విడుదల చేయాలని కోరారు. రిటైర్మెంట్ బెనిఫిట్స్ సకాలంలో చెల్లింపు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఏపీపీటీఏ యూటీఎఫ్, ఏపీటీఎఫ్, ఎస్టీయూ, శాప్, ఎస్టీయూ సంఘాలు, ఫ్యాప్టో జనరల్ సెక్రటరీ అనిల్ కుమార్‌తో పాటు మన్యం జిల్లా అధ్యక్షుడు చింతాడ రాము, ప్రధాన కార్యదర్శి బి.నర్సింగరావు, ఆర్థిక కార్యదర్శి, కార్యదర్శి కె.సత్యారావు ఉపాధ్యాయులు శుభకర్, రాము, సభ్య సంఘాల నాయకులు పాల్గొన్నారు.



కలెక్టరేట్ వద్ద నిరసన తెలుపుతున్న ఫ్యాప్టో, ఉపాధ్యాయ సంఘాలు

వాహనాల కోసం జనరల్ పార్కింగ్ ఏర్పాటు చేయండి

పార్వతీపురంటౌన్: రైల్వేస్టేషన్ వద్ద పార్కింగ్ చేసే వాహనాలకు జనరల్ పార్కింగ్ ఏర్పాటు చేయాలని కాంగ్రెస్ పార్టీ ఓబీసీ జిల్లా చైర్మన్ వి. దాలినాయుడు డిమాండ్ చేశారు. ఈ మేరకు సబ్ ఇన్‌స్పెక్టర్ ఇగ్నేష్ కుల్లును కలిసి రైల్వేస్టేషన్ వద్ద వాహనాల పార్కింగ్‌లో ప్రజల సమస్యలపై వినతి పత్రం అందజేశారు . ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ రైల్వేస్టేషన్‌కు తమ వారిని డ్రాప్ చేయడానికి, రిసీవ్ చేసుకోవడానికి, రిజర్వేషన్ల కోసం, రైళ్ల సమాచారం తెలుసుకునేందుకు వచ్చిన వారు తమ వాహనాలను తాత్కాలికంగా కొద్ది సమయం స్టేషన్ ముందు ఉంచితే ఇటీవల ఆయా వాహనాలకు గొలుసులతో తాళాలు వేసి, ఫైన్లు వేసి, ఆపై కేసులు పెడుతున్నట్లు పలువురు తమ దష్టికి తీసుకువచ్చారన్నారు. రైల్వేస్టేషన్ ముందు జనరల్ పార్కింగ్ లేకపోవడంతో కొన్ని తరాలుగా వస్తున్న అలవాటు ప్రకారం రైల్వేస్టేషన్ ముందు వాహనాలను పార్క్ చేస్తున్నారన్నారు. కొద్దిసేపు పనుల నిమిత్తం వచ్చినవారు పెయిడ్ పార్కింగ్‌లో తమ వాహనాలను ఉంచలేరని, కాబట్టి జనరల్ పార్కింగ్‌కు స్థలాన్ని కేటాయించాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు తీళ్ల గౌరీశంకరరావు తదితరులు పాల్గొన్నారు.



ఆర్పీఎఫ్ ఎస్సై ఇగ్నేష్‌కు వినతిపత్రం అందజేస్తున్న కాంగ్రెస్ నాయకులు

అగ్ని ప్రమాదాల నియంత్రణపై అవగాహన కలిగి ఉండాలి

పార్వతీపురం టౌన్: అగ్నిప్రమాదాల నియంత్రణపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని అగ్నిమాపక అధికారి జి.ప్రభాకర్ రావు అన్నారు. అగ్నిమాపక శాఖ ఆధ్వర్యంలో బుధవారం స్థానిక బాలల సత్వర చికిత్స కేంద్రంలో వైద్యాధికారులతో పాటు నర్సులు, సెక్యూరిటీ సిబ్బంది, ఆస్పత్రికి వచ్చిన ప్రజలకు అగ్ని ప్రమాదాల గురించి అవగాహన కల్పించారు. డాక్టర్లు, నర్సులు, సిబ్బందికి హాస్పిటల్‌లో అగ్నిప్రమాదం జరిగినప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, అడ్మిషన్‌లో ఉన్న పేషెంట్లను అగ్ని ప్రమాదం జరిగినప్పుడు బయటికి ఎలా తీసుకురావాలనే అంశాలపై సూచనలు, సలహాలు ఇచ్చారు. వాటి నివారణోపాయంలో భాగంగా కొన్ని ప్రదర్శనలు చేసి చూపించారు. కార్యక్రమంలో డాక్టర్‌లు సౌజన్య, భరత్‌చంద్ర, ఉదయ్ కుమార్, అగ్నిమాపక సిబ్బంది పాల్గొన్నారు.



అగ్నిప్రమాదాలపై అవగాహన కల్పిస్తున్న అగ్నిమాపక అధికారి జి.ప్రభాకర్ రావు

మహిళలు ఆర్థికంగా బలపడాలి

పార్వతీపురం: మహిళలు ఆర్థికంగా బలపడాలని వెలుగు ఏపీఎం వై.నీలంనాయుడు అన్నారు. ఈ మేరకు బుధవారం పార్వతీపురంలోని మండల సమాఖ్య కార్యాలయంలో మహిళాసమాఖ్య సభ్యులతో వార్షిక అప్పులు, జీవనోపాధి ప్రణాళికల తయారీపై అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వయం సహాయక సంఘాలు పటిష్టం కావడానికి అవసరమైన నాణ్యమైన సేవలు అందించడంలో దోహదపడే చర్యలు చేపడుతున్నామన్నారు. కార్యక్రమంలో గ్రామైక్య సంఘం సీఆర్‌పీలు, వీఓఏలు పాల్గొన్నారు.